క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం

గోకవరం: దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని అక్టోబర్ రెండో తేదీ వరకు నిర్వహించే సేవా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా గోకవరం ప్రభుత్వాస్పత్రిలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.రామక లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు, వలంటీర్లు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పందుల సంచారం



పెద్దవీధిలో సంచరిస్తున్న పందులు

ఏలేశ్వరం: పట్టణంలో విచ్చలవిడిగా పందుల సంచారంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో పందులతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంపులుగా తిరుగుతూ జనవాసాల మధ్య తిష్ట వేస్తున్నాయి. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టణంలోని పెద్దవీధి, తోటవీధి, దిబ్బలపాలెం తదితర ప్రాంతాల్లో పందులు విపరీతంగా సంచరిస్తున్నాయి. వీటి సంచారంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. వీటిని నిరోధించాలని ప్రజలు కోరుతున్నారు.

శతాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



ఏలేశ్వరంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ఎస్ శ్రేణులు

ఏలేశ్వరం: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల కరపత్రాలను పట్టణంలో ఆదివారం ఆవిష్కరించారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు కావడంతో వచ్చే నెల 5న ర్యాలీ నిర్వహించనున్నారు. జగ్గంపేట ఖండ ఏనుగు సుబ్రహ్మణ్యం శ్రీనివాస్, కోరుమిల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 5న జరిగే ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గుర్రం లోవరాజు, పిన్నం, శివరామకృష్ణ, గొల్ల విజయ్‌కుమార్, గొల్ల సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానంతో పూర్వీకులకు నివాళులు

జగ్గంపేట: అన్నదానంతో పూర్వీకులకు నివాళులర్పించి వారి ఆశీర్వాదాలు పొందవచ్చునని జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ పేర్కొన్నారు. మహాలయ పితృపక్ష అమావాస్య సందర్భంగా జగ్గంపేట పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మన ప్రాంతాల్లో ఇటువంటి సాంప్రదాయాలు జరపడం ద్వారా పితృదేవతలు సంతృప్తి చెందుతారని తద్వారా ఆయువు, ధనం, సంతానం, ఇతర శ్రేయస్సు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై టి.రఘునాధరావు, వాకర్స్‌క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తలుపులమ్మను దర్శించుకున్న భక్తులు



లోవ దేవస్థానంలో భక్తుల రద్దీ

తుని రూరల్: కోరిన కోర్కెలు తీర్చే తలుపులమ్మ అమ్మవారిని ఐదు వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలి వచ్చిన భక్తులు, భవానీ మాలధారులు క్యూలైన్ల ద్వారా దర్శించుకున్నట్టు డిప్యూటీ కమిషనర్ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలు విక్రయం ద్వారా రూ.69670, పూజా టికెట్లకు రూ.48650, తలనీలాలకు రూ.5240, వాహన పూజలకు రూ.4250, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.50862, విరాళాలు రూ.42982 వెరసి మొత్తం రూ.2,21,654 ఆదాయం లభించినట్టు ఈఓ తెలిపారు.

చిత్రలేఖనం పోటీలు

సామర్లకోట: ప్రతి ఏడాది రైల్వే ఉమ్మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులు, కార్మికుల పిల్లలకు నిర్వహిస్తున్న వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో భాగంగా ఆదివారం స్థానిక రైల్వే కల్యాణ మండపంలో డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. 6 నుంచి 9 ఏళ్లు ఉన్న విద్యార్థులకు ఇష్టమైన జంతువు, 10 నుంచి 12 ఏళ్లు ఉన్న వారికి సూపర్ హీరో, 13 నుంచి 15 ఏళ్ల వయసు కలిగిన విద్యార్థులకు పండగ సంబరాలపై మూడు కేటగిరిలుగా విభజించి పోటీలు నిర్వహించినట్టు రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు. ఈ డ్రాయింగ్ పోటీల్లో 62 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న వారందరికి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. రెండు ఆదివారాలు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న వారి పేపర్లను విజయవాడ రైల్వే డివిజన్ కార్యాలయానికి పంపిస్తారు.

జై భవానీ

- దేవీనవరాత్రులకు సర్వం సిద్ధం
- ముస్తాబైన అమ్మవారి ఆలయాలు
- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

తుని రూరల్: దసరా ఉత్సవాల ఏర్పాట్లు సర్వం సిద్ధమయ్యాయి. సోమవారం నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు నిర్వహించే దేవీ నవరాత్ర ఉత్సవాలకు గ్రామాల్లో యువకులు పందిళ్లు వేసి కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. సోమవారం శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించి పూజలు చేయనున్నారు. ఇప్పటికే పందిళ్లు వేసి విశేషంగా అలంకరించారు. ఉత్సవాలను పురష్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దేవదాయశాఖ ఆధ్వర్యాన లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారికి, కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి అమ్మవారికి తొమ్మిది రోజులు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఎస్.అన్నవరం, తేటగుంట, కేఓ.మల్లవరం, డి.పోలవరం, వి.కొత్తూరు, రేఖవానిపాలెం, హంసవరం, టి.తిమ్మాపురం, చేపూరు, తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించనున్నారు.

శరన్నవరాత్రఉత్సవాలకు ముస్తాబైన దేవీచౌక్ ఆలయం

గోకవరం: సిరులు కురిపించే చల్లని తల్లి, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచిన గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మవారి శరన్నవరాత్ర ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 22 నుంచి అక్టోర్ 2 వరకు జరిగే 23వ శరన్నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. గోకవరంలో స్థానిక తాణాసెంటర్‌లో మూడుకూడళ్ల వద్ద 2002లో అక్టోబర్ 12న అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి మండపాన్ని నిర్మించారు. భక్తులు, గ్రామస్తులతో పాటు ఈ మార్గంలో ప్రయాణించేవారు అమ్మవారిని దర్శించుకుని మొక్కుకునేవారు. వారి మొక్కులు తీరడంతో భక్తులకు నమ్మకం పెరిగి రోజురోజుకు అమ్మవారి భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. దీంతో భక్తుల సహకారంతో రాజమహేంద్రవరంలో దేవీచౌక్ ఆలయాన్ని పోలినట్టు ఉండే ఆలయాన్ని నిర్మించారు. అలాగే భక్తుల సహకారంతో అంతరాలయాన్ని వెండితో తాపడం చేయించారు. రూ.21 లక్షలతో బంగారు కిరీటంతో పాటు అనేక వెండి, బంగారు ఆభరణాలు అమ్మవారికి కానుకలుగా వచ్చాయి. అలాగే అమ్మవారిని ఊరేగించేందుకు భక్తులు కంబాల శ్రీనివాస్‌రావు రూ.50 లక్షల వ్యయంతో రథం సిద్ధం చేయిస్తున్నారు.

గోకవరం దేవీచౌక్ కనకదుర్గాదేవి అలంకారణలు

ఆలయంలో సోమవారం నుంచి అక్టోబర్ 2 వరకు జరిగే అమ్మవారి అలంకరణలు ఇవీ..

మొదటి రోజు	బాలత్రిపురసుందరీదేవి
రెండో రోజు	గాయత్రీదేవి
మూడో రోజు	అన్నపూర్ణాదేవి
నాలుగో రోజు	భువనేశ్వరీదేవి
ఐదో రోజు	మహాలక్ష్మీదేవి
ఆదో రోజు	లలితాత్రిపురసుందరీదేవి
ఏడో రోజు	మహా చండీదేవి
ఎనిమిదో రోజు	మహా సరస్వతీదేవి
తొమ్మిదో రోజు	కనకదుర్గాదేవి
పదో రోజు	మహిషాసురమర్దినిదేవి
11వ రోజు	రాజరాజేశ్వరీదేవి

23 ఏళ్లుగా ఉత్సవాలు

అమ్మవారిని ప్రతిష్ఠించిన మరుసటి యేడాది నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ అలంకారాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదేవిధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంటుంది. త్రేడాది కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయం చుట్టూ విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల్లో తొమ్మిది రోజుల పాటు అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారని, ప్రతి రోజు అలంకార పూజలు, హోమాలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు ఆరవల్లి సీతారామాచార్యులు, డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, వల్లూరి శ్రీనివాస్‌శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



గోకవరంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన దేవీచౌక్ ఆలయం



ఆలయంలో కనకదుర్గమ్మ



జగపతినగరంలో అభయదుర్గమ్మ ఆలయం

కిర్లంపూడిలో..

కిర్లంపూడి: మండలంలో జగపతినగరం అభయదుర్గమ్మ, కిర్లంపూడిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు, కిర్లంపూడి ఊరు శివారున ఉన్న వనదుర్గమ్మ, చిల్లంగి, రామచంద్రపురం, బూరుగుపూడి, వీరవరం, సింహాద్రిపురం, వేలంక, తామరాడ గ్రామాల్లో వేంచేసి ఉన్న కనక దుర్గమ్మ ఆలయలను సుందరంగా అలంకరించారు.

సుందరంగా అమ్మవారి ఆలయాలు

ఏలేశ్వరం: విజయదశమి వేడుకలకు పట్టణంలోని లింగంవరం కాలనీ, తోటవీధి, ఆర్టీసీబస్టాండ్, నర్సీపట్నంరోడ్, దిబ్బలపాలెం సంతోషిమాత ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాల వద్ద అమ్మవారి భారీ విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం కుంకుమ పూజలతోపాటు రాత్రివేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. ఉత్సవాల అనంతరం అమ్మవారి విగ్రహాలను ఊరేగించి నిమజ్జనం చేయనున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నదానాలు చేసేందుకు కమిటీ సభ్యులు సిద్ధమవుతున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా..

జేవీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ఘనంగా చేసేందుకు ఏర్పాటు చేసిన సెట్టింగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ట్రస్టు అధ్యర్యంలో ప్రతిఏడాది లింగవరం కాలనీలో ప్రధాన రహదారి సమీపంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. స్థానిక దిబ్బలపాలెంలోని సంతోషిమాత ఆలయం వద్ద ఏర్పాటు చేసే అమ్మవారి విగ్రహం ప్రత్యేకతను సంతరించుకుంటుంది. స్థానిక తోట వీధిలో గత 42 ఏళ్ల దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది ఇక్కడ భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



ఏలేశ్వరంలోని లింగవరంకాలనీలో అమ్మవారి ఆలయ సెట్టింగ్



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

దసరా వేడుకలకు రత్నగిరి ముస్తాబు

- నేటి నుంచి అమ్మవార్లకు పూజలు
- నేడు బాలాత్రిపురసుందరిగా వనదుర్గ, కనకదుర్గ



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారి ఆలయం

అన్నవరం: శరన్నవరాత్ర వేడుకలు(దసరా ఉత్సవాలు) ఆశ్వీయుజ శుద్ధ పాఢ్యమి సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రత్నగిరిపై ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. సత్యదేవుని ఆలయంతోపాటు వనదుర్గ, కనకదుర్గ ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అక్టోబర్ రెండో తేదీ వరకూ ఈ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. పండగ తొమ్మిది రోజులు అమ్మవార్లకు కుంకుమ పూజలు, విజయదశమి రోజున చండీ హోమం పూర్ణాహుతి నిర్వహిస్తారు.

నేడు బాలాత్రిపుర సుందరిగా దర్శనం

దసరా ఉత్సవాల 11 రోజులు వనదుర్గ కనకదుర్గ అమ్మవార్లు రోజుకొక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దసరా తొలిరోజు సోమవారం బాలా త్రిపురసుందరి అలంకరణలో దర్శనమివ్వనున్నారు.

కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభం

సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు సత్యదేవుని ఆలయంలో పండితులు కలశస్థాపన చేసి దసరా వేడుకలకు అంకురార్పణ చేస్తారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదేవిధంగా వనదుర్గ, కనకదుర్గ, రామాలయంలో కూడా కలశస్థాపన చేసి ఉత్సవాలు ప్రారంభిస్తారు. ఈ పూజల్లో 44 మంది రుత్విక్కులు 16 మంది అర్చకస్వాములకు అధికారులు దీక్షా వస్త్రాలు అందజేయనున్నారు.

పంచహారతుల సేవ నిలిపివేత

ప్రతి రోజు రాత్రి ఏడు గంటలకు సత్యదేవుని ఆలయంలో జరిగే పంచహారతుల సేవ దసరా వేడుకల సందర్భంగా సోమవారం నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు నిలిపివేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ కారణంగా పంచహారతుల సేవ టిక్కెట్లు విక్రయాలు, సాయంత్రం ఆరు గంటలకు జరిగే అంతరాలయ దర్శనం కూడా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. అయితే స్వామి, అమ్మవారికి పవళింపు సేవకు బదులు దసరా ఉత్సవాల్లో రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు దర్బారు కార్యక్రమం నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.

ఘనంగా మరిడమ్మతల్లి జాతర



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

రౌతులపూడి: ఎస్.పైడిపాలలో మరిడమ్మ తల్లి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఏటా సెప్టంబర్‌లో ఉత్తర కార్తె మొదటి ఆదివారం రోజున ఈ పండగను జరుపుకోవడం గ్రామస్తులు ఆనవాయితీ. కుటంబమంతా పవిత్ర స్నానాలు ఆచరించి సాయంత్రం సంధ్యా సమయంలో వీధుల్లో అమ్మవారిని పసుపు, కుంకమ, పండ్లు, పూలతో పూజించారు. అనంతరం ఎవరికి వారు ఇళ్ల వద్ద తయారు చేసుకున్న వివిధ రకాల పిండి వంటలను నేవేథ్యంగా సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

డ్రోన్ కెమెరాతో పెట్రోలింగ్

జగ్గంపేట: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో డ్రోన్ కెమెరాతో పెట్రోలింగ్, ప్రహరా నిఘా ఏర్పాటు చేసినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలియజేశారు. దసరా సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం డ్రోన్ నిఘా ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

శునకాల స్వైరవిహారం



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో ఉన్న కుక్కలు

ప్రత్తిపాడు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీటి వల్ల ఆసుపత్రిలో రోగులు బెంబేలెత్తుతున్నారు. రాత్రివేళ నిద్రపోతున్న సమయాన కుక్కలు వార్డులలో దండయాత్ర చేయడంతో కంటిమీద కునుకు కరువైందని రోగులు ఆవేదన చెందుతున్నారు. అంతేకాకుండా రోగులను చూసేందుకు వచ్చే బంధువులపై విరుచుకుపడుతున్నాయి. దీంతో ఆందోళన చెందుతున్నారు. శునకాలు ఆసుపత్రిలో స్వేచ్ఛగా సంచరిస్తున్నా సిబ్బంది పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా సీహెచ్‌సీ అధికారులు స్పందించి, కుక్క కాట్లకు గురికాక ముందే తగు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. ఇటీవల కుక్కల దాడి ఎక్కువై పోయిందని ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు చెప్పారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని, కుక్కల నుంచి రోగులకు, సీహెచ్‌సీకి వచ్చేవారికి రక్షణ చేపట్టాలని ఆయన కోరుతున్నారు.

మురళీకృష్ణంరాజు పరామర్శ



ఒమ్మంగిలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: ఒమ్మంగిలో బాధిత కుటుంబాలను ఆదివారం వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. వారికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన కొప్పర్తి ఏసుబాబు భార్య అమ్మాజీ రెండు మోకాళ్లకు తీవ్ర గాయమైంది. వారి ఇంటికి వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని రూ.ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అర్జుపూడి రాంబాబు ఇటీవల అనారోగ్యానికి గురై హాస్పటల్‌లో చికిత్స పొందారు. అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయన్ని మురళీకృష్ణంరాజు పరామర్శించి, రూ.ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు గంటా గంగబాబు, తోటేటి శేఖర్, గంట బుజ్జి, శైలు నాగేశ్వరరావు, గంట చిట్టిబాబు, దారా నూకరాజు, నార్లంక వెంకన్న బాబు, మిత్తన వీరబాబు, చెవల వీరబాబు, సుంకర రాంబాబు, సుంకర తమ్మారావు, చెవల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

జగ్గంపేట: గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామ శివారు జగనన్న కాలనీ సమీపంలో పేకాడుతున్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్సై టి.రఘునాథరావు, సిబ్బంది దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ. 5,100 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

‘కలెక్టరేట్ ముట్టడి’ని జయప్రదం చేయండి



రంపయర్రంపాలెంలో నిరసన తెలుపుతున్న రైతు కూలీ సంఘం నాయకులు

గోకవరం: గ్రామంలో దళిత మైనర్ బాలికపై అత్యాచార ఘటనలో బాధితురాలికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చేయనున్న రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు రంపయర్రంపాలెంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికపై అత్యాచారం జరిగి పది రోజులు గడచినా కూటమి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కనీసం స్పందించకపోవడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. ఒక దళిత హోం మినిస్టర్ ఉన్న రాష్ట్రంలో దళిత మహిళలకు, అమ్మాయిలకు రక్షణ లేకుండాపోయిందని, మంత్రిగా స్పందించి అత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని ఆర్థికంగా అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరుతూ సోమవారం రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ముసలయ్య, రమణ, వీర పండు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

సామర్లకోట: కాకినాడ వెళ్లే రోడ్డులో సామర్లకోట నుంచి కాకినాడ వెళుతున్న ఓ ప్రయాణికుడు ఆదివారం స్కూటీపై వికే రాయపురం సమీపంలో రోడ్డుపై ఉన్న గోతులను గమనించకపోవడంతో స్కూటీ గోతిలో పడి బోల్తా పడింది. దీంతో ప్రయాణికుడు తీవ్రంగా గాయపడ్డాడు. సంఘటనను గమనించిన స్థానికులు హుటాహుటిన క్షతగాత్రుడిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా వివరాలు రావాల్సి ఉందన్నారు.

కిర్లంపూడిలో స్వచ్ఛభారత్



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

కిర్లంపూడి: నరేంద్ర మోదీ జన్మదినం వేడుకలు పురస్కరించుకుని బీజేపీ నాయకులు కిర్లంపూడిలో ఆదివారం సేవా పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు శరకణం రాజుబాబు అధ్యక్షతన నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి ఆ పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి దాట్ల కృష్ణ వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కిర్లంపూడిలోని ప్రధాన వీధులను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ మాజీ ప్రెసిడెంట్ తోట గోపి, ఐవివి సత్యనారాయణమూర్తి, కంటా కాశీ విశ్వనాథం తదితరులు ఉన్నారు.

కలుషితమవుతున్న చెరువులు



గోకవరంలో కోళ్ల వ్యర్థాలతో కలుషితమైన సరాగడు వారి చెరువు



చెరువులో కలపడానికి సిద్ధంగా ఉంచిన కోళ్ల పెంట

- అనారోగ్యం పాలవుతున్న పశువులు
- నష్టపోతున్న పాడిరైతులు

గోకవరం: చేపల చెరువు పేరుతో చెరువుల్లో కోళ్ల వ్యర్థాలు వేస్తుండడంతో నీరు కలుషితమవుతోంది. ఆ నీటిని తాగుతున్న పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయి. దీంతో పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు.

గోకవరం శివారున రంపయర్రంపాలెం వెళ్లే మార్గంలో ఉన్న సరాగడు వారి చెరువును పంచాయతీ ఆధ్వర్యంలో చేపల చెరువుకు వేలంకు ఇచ్చారు. నిబంధనల ప్రకారం చేపల చెరువులో ఎటువంటి కోళ్ల వ్యర్థాలు వేయకూడదు. అయితే వేలం పాటదారులు చేపలకు మేతగా చెరువులో కోళ్ల వ్యర్థాలు, పెంట వేస్తున్నారు. దీంతో చెరువు పూర్తిగా కలుషితమవుతోంది. ఈ చెరువులో నీటిని తాగుతున్న పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయి. ఈ విధంగా ఇటీవల పదుల సంఖ్యలో పాడి పశువులు అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలయ్యాయి. దీంతో పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అలాగే చెరువు నుంచి కూడా దుర్గంధం వెదజల్లుతోంది. దీనిపై పలువురు పాడి రైతులు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అయితే సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు పాడి రైతులు దొంతల సుబ్బారావు, నానాజీ, వెంకన్న తదితరులు తెలిపారు.

కొండపోడు పట్టాలు మంజూరు చేయాలి



వంతాడలో నిరసన తెలుపుతున్న గిరిజనులు

ప్రత్తిపాడు రూరల్: వంతాడ గ్రామంలో సాగులో ఉన్న కొండపోడు భూములకు పంటాలు మంజూరు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన పరదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘ నేత రాఘవ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గిరిజనుల సాగులో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేసేందుకు పంచాయతీ తీర్మానం తీసుకోవల్సి ఉందన్నారు. అయితే పంచాయతీ అధికారులు గ్రామ సభ నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారని, తక్షణం గ్రామసభ నిర్వహించి గిరిజనల దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొండ పోడు భూముల రైతులు, ఆదివాసి సంఘం నేతలు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ఆలయ ఈవో కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, దాతల సహకారంతో ఈ వారం నుంచి అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు.